



సైకిల్ ఎక్కేద్దాం!

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డ వేళ జిల్లాలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా వలసలు ఊపందుకుంటున్నాయి. అధికార వైసీపీకి పార్టీ నేతలు, క్యాడర్ ఎక్కడికక్కడ బైబై చెప్పేసి టీడీపీలో చేరిపోతున్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ పుట్టి మునిగి పోవడం ఖాయమని తేలిపోవడంతో ఫ్యాన్‌ను వదిలేసి సైకిల్ ఎక్కేస్తున్నారు. దీంతో జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా నిత్యం టీడీపీలోకి వందలాది మంది వైసీపీ నేతలు, క్యాడర్ చేరికలు జాతరను తలపిస్తున్నాయి.

- అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో టీడీపీలోకి భారీ చేరికలు
- నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ వందల్లో క్యూకడుతున్న వైసీపీ క్యాడర్
- ప్రజావ్యతిరేకతతో వైసీపీ మునిగిపోవడం ఖాయమని తేలడంతో ముందే జంప్
- ఎంపీపీలు మొదలు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యకర్తలు భారీ క్యూ
- పార్టీ క్యాడర్‌కు ఇబ్బంది లేకుండా ఆచితూచి చేర్చుకుంటున్న టీడీపీ ఇన్‌ఛార్జులు
- ఆ ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చిన చోట వైసీపీ దాదాపుగా ఖాళీ
- ఇందులో ఇద్దరు ఎమ్మెల్యేలు సైకిల్ కోసం పరోక్షంగా పనిచేయడానికి సై

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వద్దన్నా వెల్లువలా రాజీనామాలు చేసి వచ్చేస్తోన్న నేతలు, క్యాడర్‌ను చేర్చుకోలేక టీడీపీ ఎక్కడికక్కడ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇందులోభాగంగా చేరికలకు ఏకంగా తేదీలు నిర్ణయించుకుని చేరికలు చేసుకోవాల్సి వస్తుండడం ఖాళీ అయిపోతున్న వైసీపీ దుస్థితిని చాటుతోంది. ప్రధానంగా ఇటీవల సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చేసిన ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కొత్త నాయకత్వంతో ఇమడలేక వేలాదిమంది వైసీపీ క్యాడర్ గడచిన నెలన్నరలో భారీగా టీడీపీలోకి చేరిపోయారు. మిగిలిన నియోజకవర్గాల్లోను ఎమ్మెల్యేలు ఎంత ఆపే ప్రయత్నం చేస్తున్నా ఇమడలేక సైకిల్ ఎక్కడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఎంపీపీలు, సర్పంచ్‌లు అయితే తమకు గౌరవం లేకుండా చేసిన పార్టీలో ఉండలేక టీడీపీకి క్యూ కట్టేస్తున్నారు. మండలాల్లో సీనియర్ నేతలు, ఇతర క్యాడర్ అయితే పార్టీలో ఎన్నో ఏళ్లనుంచి పనిచేస్తున్నా గుర్తింపునకు నోచుకోకపోవడం, తమకంటే వలంటీర్లకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుండడంతో వారు కూడా బైబై చెప్పేస్తున్నారు. వీటికి అడ్డుకట్టవేయలేక వైసీపీ తలపట్టుకుంటోంది.

ఉండలేం.. వదిలేద్దాం..

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడడంతో అధికార వైసీపీలో అంతకంతకు కుదుపులు పెరిగిపోతున్నాయి. రాబోయే ఎన్నికల్లో పార్టీ పరాజయం ఖాయమన్న అంచనాలతో ఆ పార్టీలో అనేకమంది నేతలు రాజకీయ భవిష్యత్తుకోసం ఇప్పటినుంచే సైకిల్ ఎక్కేస్తున్నారు. ఒకపక్క జగన్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొనడం, అటు టీడీపీ, జనసేన కూటమి భారీ విజయం సాధించడం ఖాయమన్న సర్వేలు, ఇతర అంచనాలతో వైసీపీని పెద్దఎత్తున వీడిపోతున్నారు. ఇంకా ఆ పార్టీలో కొనసాగితే రాజకీయ భవిష్యత్తు ఉండదనే లెక్కలతో వరుసగా సైకిల్ ఎక్కేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా వైసీపీనుంచి వందలాదిగా నేతలు, క్యాడర్ టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. షరతులతో సంబంధం లేకుండా పార్టీలోకి వెల్లువలా వచ్చి చేరుతున్నారు. దీంతో వైసీపీ ఖాళీ అవుతోంది.

నియోజకవర్గాలవారీగా..

జగ్గంపేట నియోజకవర్గంలో గడచిన రెండు నెలల్లో నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లో వైసీపీని వీడిపోయి వందలాదిమంది క్యాడర్ టీడీపీ కండువా కప్పుకున్నారు. వీరిలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు, వివిధ పార్టీ విభాగాల నేతలు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు ఉన్నారు. వీరందరినీ ఒకేసారి చేర్చుకోలేక ఒక్కో మండలానికి ఒక్కో తేదీ కేటాయిస్తూ మాజీ ఎమ్మెల్యే నెహ్రూ ఆధ్వర్యంలో సైకిల్ ఎక్కుతున్నారు. ప్రధానంగా ఇక్కడ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును తప్పించి ఆయన స్థానంతో మాజీమంత్రి తోట నరసింహానికి టిక్కెట్ ఇచ్చారు. దీంతో గురుగ్రా ఉన్న వైసీపీ క్యాడర్ ఇప్పటికే పెద్దఎత్తున టీడీపీలో చేరిపోయారు. ఎమ్మెల్యే చంటిబాబు వర్గం కూడా టీడీపీ తీర్థం పుచ్చుకుంది.

ప్రత్తిపాడులో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ టిక్కెట్ చించేయడంతో ఆయన అనుకూల వర్గం అంతా రాజకీయ భవిష్యత్తుకోసం టీడీపీలో చేరిపోయారు. దీంతో ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది.

పిఠాపురంలో వైసీపీకి కిందిస్థాయి క్యాడర్ షాక్ ఇచ్చింది. ఇక్కడ టీడీపీ గెలుపు ఖాయమని తేలడం, ఎమ్మెల్యే దొరబాబును తప్పించి వైసీపీ టిక్కెట్ వంగా గీతకు ఇవ్వడంతో ఇది సహించలేని అనేకమంది వైసీపీ నేతలు, క్యాడర్ రెండు నెలలుగా వందల్లో టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ సమక్షంలో సైకిల్ ఎక్కేశారు.

తునిలో మంత్రి రాజా తీరు నచ్చకపోవడం, తమకంటే వలంటీర్లకే అధిక ప్రాధాన్యం ఇస్తుండడం, పార్టీ ఈసారి గెలవదనే లెక్కలతో తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో వందలాదిమంది వైసీపీ కీలక నేతలు, కార్యకర్తలు భారీగా టీడీపీలో చేరిపోయారు.

పెద్దాపురం, కాకినాడ, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లోను అక్కడ వైసీపీ ఇన్‌ఛార్జులతో వేగలేకపోవడం, వైసీపీకి గడ్డు పరిస్థితులు తలెత్తడంతో గెలిచే పార్టీలో రాజకీయ భవిష్యత్తు కోసం వందలాదిమంది టీడీపీలో చేరారు. టీడీపీలోకి అవకాశం లేని నేతలు, క్యాడర్ జనసేనలోను భారీగా చేరుతున్నారు.

జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో అధికార వైసీపీ తరఫున గెలిచిన సర్పంచ్‌లైతే గడచిన కొన్నినెలల్లో ఆ పార్టీకి భారీగా రాజీనామా చేసేశారు. వైసీపీ తరఫున గెలిచినా ఇంతకాలంగా తమకు ఏ విలువ లేకుండా చేశారని కొంతకాలంగా వీరు రగిలిపోతున్నారు. నిధులు లేకుండా ఉత్సవ విగ్రహాల్లా మార్చేశారని, అదే టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు విలువ పెరుగుతుందనే నమ్మకంతో జిల్లావ్యాప్తంగా భారీగా టీడీపీలో చేరారు.

ఆ ఊపుతో ఇంకా..

మరోపక్క ఇటీవల టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో మరింత భారీ ఊపొచ్చింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల్లో వైసీపీనుంచి ఇంకా వలసలు భారీగా పెరిగిపోతున్నాయి. అనేకమంది పార్టీలో చేరడానికి టీడీపీ కీలక నేతల ద్వారా నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు టచ్‌లోకి వస్తున్నారు. భవిష్యత్తులో పదవులు అక్కర్లేదని, పార్టీలో చేర్చుకుంటే చాలంటూ రాయబారాలు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ సైకిల్ ఎక్కడానికి సిద్ధపడుతున్న వైసీపీ నేతలు, కార్యకర్తల విషయంలో టీడీపీ ఆచితూచి వ్యవహరిస్తోంది. స్థానిక నాయకత్వానికి ఇబ్బందులు లేకుండా వారితో సంప్రదింపులు చేస్తూ ముందుకు వెళ్తోంది. మున్ముందు ఈ వలసలు ఇంకా పెరిగే అవకాశం ఉండడంతో వ్యూహాత్మకంగా టీడీపీ ఇన్‌ఛార్జులు ముందుకు వెళ్తున్నారు.

వైసీపీని ఓడించాలని..

ఇటీవల వైసీపీలో టిక్కెట్‌లు కోల్పోయిన ముగ్గురు ఎమ్మెల్యేల్లో ఇద్దరు ఇప్పటికే తమ క్యాడర్‌ను టీడీపీకి పంపేశారు. అటు వీరు కూడా ఎన్నికల్లో పరోక్షంగా టీడీపీకి సహకరించాలని నిర్ణయించారు. తమను అవమానించి టికెట్ లేకుండా చేసిన వైసీపీని ఎలాగైనా ఓడించాలనే పట్టుదలతో పావులు కదుపుతున్నారు. కాగా కళ్లముందే ఖాళీ అవుతోన్న క్యాడర్‌ను చూసి వైసీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు తలలు పట్టుకుంటున్నారు. వారిని ఆపడం ఎలాగో తెలియక బతిమాలుకుంటున్నారు. ఏదో పొరపాటు అయిందని, తప్పకుండా ప్రాధాన్యం ఇస్తామని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నా ఎవరూ వినకుండా సైకిల్ ఎక్కేస్తుండడంతో తలపట్టుకుంటున్నారు. టీడీపీకి పోటీగా నియోజకవర్గాల్లో కొత్త నేతలు, క్యాడర్‌ను చేర్చుకుని వైసీపీ కండువా కప్పడానికి ఎంత ప్రయత్నం చేస్తున్నా చేరే వారు కరువవడంతో బేల చూపులు చూస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- అన్ని సెంటర్లలో ఏర్పాట్లు పూర్తి
- ఆలస్యమైతే అనుమతి లేనట్లే..

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 29: శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లూ చేశామని కాకినాడ జిల్లా డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయని, ఆలస్యంగా వచ్చే విద్యార్థులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 22,059మంది, రెండో ఏడాది పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 22,120మంది హాజరుకానున్నారని డీఐఈవో తెలిపారు. పరీక్షలు మార్చి 1న ప్రారంభమై 20 వరకూ కొనసాగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయం, నిరంతర విద్యుత్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా సెంటర్లకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అడిషనల్ డీవోలు, కస్టోడియన్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిటింగ్ స్క్వాడ్స్‌ని నియమించామన్నారు. పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని పేర్కొన్నారు.

ఒత్తిడి వద్దు..



పరీక్షలు... ప్రశాంతంగా రాయండి!

పరీక్షల వేళ ఒత్తిడిని అస్సలు దరిచేయనీయకూడదు. పరీక్షలకు ఇంటి వద్ద నుంచి బయలుదేరడం దగ్గర నుంచీ పరీక్ష రాసి బయటకు వచ్చేవరకూ మానసికంగా భయపడకూడదు. ఒత్తిడి పడడం వల్ల తెలిసిన సమాధానాలను కూడా మరిచిపోయే ప్రమాదం ఉంది. పరీక్ష పత్రం అందుకొన్న తర్వాత ప్రశాంతంగా ఓ ఐదు నిమిషాలు చూసుకొని బాగా సమాధానాలు తెలిసిన ప్రశ్నలతో మొదలుపెట్టాలి. తర్వాత కొంత తెలిసినవి, చివరిలో రావనుకొని వదిలేసిన ప్రశ్నల సమాధానాల కోసం ప్రయత్నించాలి. జవాబులు ఎంత అవసరమో అంతే రాస్తే సమయం కలిసి వస్తుంది. బాగా తెలుసునని రాసుకుంటూపోతే సమయం వృథా అవుతుంది. అందువల్ల సమయాన్ని అంచనా వేసుకుంటూ జవాబులు రాసుకోవాలి. ఈ క్రమంలో జవాబు పత్రాలపై ప్రశ్నల నంబర్లను వేయడంలో జాగ్రత్త వహించాలి. జవాబు పత్రాలపై ఇన్విజిలేటర్ల సూచనలను పాటిస్తూ హాల్ టికెట్ నంబరు తదితరాలు నింపాలి. మరుసటిరోజు పరీక్షలకు అవసరమైన వాటిని.. అంటే స్కేలు, పెన్సిలు, పెన్నులు, డయాగ్రం వేసే వస్తువులు, హాల్ టికెట్‌లను ఒకచోట పెట్టుకుంటే పరీక్షకు బయలుదేరే సమయంలో హైరానా పడాల్సిన అవసరం ఉండదు. పరీక్ష జరుగుతున్న రోజుల్లో సాత్వికాహారం తీసుకోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు ప్రశాంతంగా ఉండే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలి. పరీక్ష రోజుల్లో సరిపడా నిద్ర చాలా అవసరం. నిద్ర లేకపోతే ఆ ప్రభావం పరీక్షపై పడుతుంది. అందువల్ల రివ్యూ చేసుకున్నా సమయానికి నిద్రపోవాలి. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. అంటే 8గంటలకల్లా పరీక్ష కేంద్రం వద్ద ఉండేలా ఇంటి నుంచి బయలుదేరాలి.

- **సామాజిక బాధ్యతను గుర్తెరిగి..**

పరీక్షలకు బయలుదేరే విద్యార్థులు తారసపడితే.. వారికి అవసరమైతే ఆటోవాలాలు ఇతర వాహనదారులు ఆ విద్యార్థులను పరీక్ష కేంద్రాల వద్దకు చేర్చడం సామాజిక బాధ్యతగా గుర్తెరగాలి. ఒక్కోసారి బస్సులు ఆలస్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. అలాంటి వాళ్లను వాహనదారులు ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు సకాలంలో తీసుకువెళ్లాలి.

తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లిలో వణుకు పుట్టింది

- ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఫిబ్రవరి 29: తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు పుట్టిందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. వైసీపీ దొంగలకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన కూటమి పోరాడుతోందన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమన్నారు. టీడీపీ, జనసేన కలిసింది వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం అని అన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజలు పెట్టుకున్న కూటమి అని, రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలపాలని కోరారు. జగన్ రాష్ట్రాన్ని విధ్వంసంలోకి తీసుకువెళ్లారని, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దళిత డ్రైవర్ మృతదేహాన్ని డోర్ డెలివరీ చేశారన్నారు. టీడీపీ అన్న క్యాంటీన్లు తెరిచి పేదలకు రూ.5తో భోజనం పెడితే జగన్ వాటిని మూయించాడన్నారు. వైనాట్ 175 అన్న ఆయనకు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్, ఇసుక, డీఎస్సీ ఎక్కడఅని ఎద్దేవా చేశారు. ప్రజాప్రయోజనాలకే టీడీపీ పాటుపడుతోందన్నారు.

ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి

- ఎస్పీ సతీష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 29: రానున్న సార్వత్రిక ఎన్నికలకు కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు సన్నద్ధంగా ఉండి పారదర్శకంగా, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన గురువారం నేరసమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను పురస్కరించుకుని పోలీస్ విధుల నిర్వహణలో అంతర జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల నిర్వహణ, నిషేధిత పదార్థాల కట్టడి, వ్యక్తుల బైండోవర్, పెండింగ్ ఎన్నికల సంబంధ కేసుల్లో పురోగతి, లైసెన్స్‌డ్ ఆయుధాల డిపాజిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసుల్లో దర్యాప్తు విధివిధానాల అవగాహన అంశాలపై సమీక్షలో చర్చించారు. సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, ఏఎస్పీ అడ్మిన్ భాస్కర్‌రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా కాస్తా.. తుస్ !!

- గ్రామాల్లో సబ్సిడీలు తీసుకుని షాపుల మూసివేత



తాళ్లరేవు మండలం సీతారామపురంలో ఉన్న ఫిష్ ఆంధ్రా షాపు

తాళ్లరేవు, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో గొప్పలుగా చెప్పుకొని పెట్టించిన ఫిష్‌ఆంధ్రా యూనిట్‌లు కాస్తా తుస్ మంటున్నాయి. తాళ్లరేవు మండలంలో మత్స్యశాఖ ద్వారా బ్యాంక్ లింకేజీలతో ఫిష్ ఆంధ్రాయూనిట్లు మంజూరయ్యాయి. కానీ సబ్సిడీలు తీసుకున్నాక ఆయా కేంద్రాలను మూసేయడంతో వాటి లక్ష్యం నీరుగారుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. చేపలు తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్న ఆలోచనతో ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోను ఫిష్ ఆంధ్రా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావించింది. ఈ కేంద్రాలను అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులకే కేటాయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. యూనిట్‌కాస్ట్ రూ.3లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఉంది. ఎస్సీలకు రూ.60వేలు, ఇతరులకు రూ.40వేలు సబ్సిడీగా ఇస్తున్నారు. షాపు ఏర్పాటు చేసి అందులో ఫ్రిజ్, ఇతర పరికరాలను ఏర్పాటు చేస్తే మత్స్యశాఖ, బ్యాంకు అధికారులు పరిశీలన చేసి యూనిట్ మంజూరు చేస్తున్నారు. బ్యాంకు లోను, సబ్సిడీలు వచ్చిన తర్వాత షాపుల బోర్డులను తిప్పేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలంతా రోజువారీ మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేస్తుండడంతో ఫిష్ ఆంధ్రా షాపులు వెలవెలబోతున్నాయి. తాళ్లరేవు మండలంలో మట్లపాలెం, చొల్లంగిపేట, కొత్తూరు, ఇంజరం, పి.మల్లవరం, తాళ్లరేవు, సీతారామపురం గ్రామాల్లో ఫిష్ ఆంధ్రా షాపులు ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ల పేరున అధికార పార్టీ కార్యకర్తలు బ్యాంకులను దోచేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. తాళ్లరేవు మండలంలో ఫిష్ ఆంధ్రా షాపులకు 9మంది దరఖాస్తులు చేయగా 8మంది లబ్ధిదారులకు సబ్సిడీలు మంజూరయ్యాయని, మరో దరఖాస్తు పరిశీలనలో ఉందని మత్స్యశాఖ అధికారి గోపి తెలిపారు.

మానవ కేంద్రిత అభివృద్ధి దిశగా ప్రపంచం పయనిస్తోంది

- కాకినాడ ఎంపీ వంగా గీత
- జేఎన్‌టీయూకేలో యువ సంవాద్ ఇండియా-2047 ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు ఎంపీ గీత, వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 29: మానవ కేంద్రిత అభివృద్ధి దిశగా ప్రపంచం పయనిస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. జేఎన్‌టీయూకేలోని వీసీ సమావేశ హాల్లో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు యూసీఈకే ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2,3 ఆధ్వర్యంలో భారతదేశ పంచప్రాణ్ యువజన సంభాషణ భారత్ కే పంచ్ ప్రాణ్ ఏక్ యువ పరిచర్చ్ అనే నినాదంతో యువ సంవాద్ ఇండియా-2047 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీ గీత, విశిష్ట అతిథిగా ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ సుమలత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ పాల్గొనగా యూసీఈకే ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ గీత మాట్లాడుతూ 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. అనంతరం వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రస్తుతం మనం సాధించే ప్రగతి భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రత్యేక అధికారి డాక్టర్ మాలోతు రమేష్, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌సెంటర్‌ను సందర్శించిన కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 29: కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు గురువారం సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. రాజాట్యాంక్ పార్కు ఆవరణలో రూ.15కోట్ల వ్యయంతో ఈ సైన్స్ సెంటర్ నిర్మాణమవుతోంది. స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు నిర్మాణ ప్రగతిని కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు, మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ రకాల ఎగ్జిబిషన్ల నిర్వాహణ, ఇతర వైజ్ఞానిక అంశాల కోసం ఈ సైన్స్ సెంటర్ నిర్మాణమవుతుందన్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ వెంకటరావు, డీఈ రామారావు పాల్గొన్నారు.

రబీ సీజన్‌లో ప్రణాళికాబద్ధంగా సాగునీరు విడుదల చేయాలి

- సాగునీటి ఎద్దడి లేకుండా కృషి చేయాలి
- రబీ సీజన్‌లో నీటి విడుదలపై సమీక్షలో కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 29: రబీ సీజన్‌లో ప్రణాళికాబద్ధంగా సాగునీరు విడుదల చేయాలని, శివారు భూములకు సాగునీరు ఎద్దడి లేకుండా కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో రబీ సీజన్‌లో సాగునీరు విడుదల, ఇతర అంశాలపై రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లాలో గోదావరి, ఏలేరు, పంపా రిజర్వాయర్ ఆయుకట్టు కింద సాగవుతున్న పంటల వివరాలు, సాగునీరు లభ్యత, కాలువల పరిస్థితులపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. సాగునీటి పంపిణీ, నియంత్రణలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి రానున్న రెండు నెలలు అత్యంత కీలకమన్నారు. ఇరిగేషన్, వ్యవసాయ అధికారుల ప్రణాళిక ప్రకారం పనిచేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. ఇందుకు రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సాగునీరును నియంత్రించేలా అధికారులు ఎప్పటికప్పుడు కాలువలపై పర్యవేక్షణ చేయడంతోపాటు వారాబంధీ విధానం, నీటిమట్టం స్థాయిలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.

1.35 లక్షల ఎకరాల్లో పంట సాగు

జిల్లాలో గోదావరి ఆయకట్టు కింద 1.35 లక్షల ఎకరాలు, ఏలేరు ఆయుకట్టు కింద 53వేల ఎకరాలు, పంపా రిజర్వాయర్ కింద 10వేల ఎకరాల్లో రైతులు పంట సాగు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నూరుశాతం ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయిందని, రైతులనుంచి ఈ-కేవైసీ పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలైన తొండంగి, పిఠాపురం, గొల్లప్రోలు, తాళ్లరేవు, పెదపూడి మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇరిగేషన్‌శాఖ అనుమతులు లేకుండా అనధికారికంగా సాగునీరు వినియోగించడాన్ని నివారించాలన్నారు. ఇందుకు మండల, గ్రామ స్థాయిలో వ్యవసాయం, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎస్.విజయ్‌కుమార్, ధవళేశ్వరం నీటిపారుదలశాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, పెద్దాపురం ఈఈ డి.రామ్‌గోపాల్, పెద్దాపురం, కాకినాడ డీఈలు కె.సురేష్, ఎ.రవి, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు
విజయవంతం చేయాలి

ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజప్ప



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, ఫిబ్రవరి 29: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మార్చి 6 నుంచి 11 వరకూ జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను అందరి సహకారంతో విజయవంతం చేయాలని, భక్తులకు సులభరీతిలో దర్శనాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. భీమేశ్వరాలయంలో ఉత్సవ ఏర్పాట్లపై పలు శాఖల అధికారులు, భక్తకమిటీ ప్రతినిధులు, దేవదాయాధికారుల సమక్షంలో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాజప్ప హాజరయ్యారు. వివిధ శాఖల ద్వారా చేపట్టనున్న కార్యక్రమాలపై సమీక్షించి తగు సూచనలు చేశారు. అలాగే వైశ్యయూత్ అసోసియేషన్‌చే పదివేల మందికి అన్నదానం, భీమేశ్వరా అన్నదాన కమిటీచే అన్నదానం, వివిధ స్వచ్ఛంద సంస్థలచే చిన్నారులకు పాలు, రొట్టెలు, అల్పాహారం, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ తదితర సేవా కార్యక్రమాలపై సమీక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకునే భక్తులకు స్నానాదికాలు అనంతరం శీఘ్రంగా స్వామి, అమ్మవారి దర్శనాలు త్వరతగతిన అయ్యేందుకు క్యూలైన్లను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. ఉత్సవాల పోస్టర్‌ను చినరాజప్ప, దవులూరి సుబ్బారావు, ఆలయ ఈవో నీలకంఠం, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు ఆవిష్కరించారు.



ప్రసంగిస్తున్న స్వామీజీ భారతి మహాస్వామి

శివతత్వాన్ని అందరూ అలవర్చుకోవాలి

- శృంగేరి శ్రీ వీరుపాక్ష శ్రీ పీఠాధిపతులు

జగ్గంపేట, ఫిబ్రవరి 29: శివతత్వం అందరూ అలవర్చుకోవాలని శృంగేరి శ్రీ వీరుపాక్ష శ్రీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు గంబీరానంద భారతి మహాస్వామి అన్నారు. కాకినాడజిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి పార్థివ లింగ మహారుద్రాభిషేకం గురువారం 4వ రోజుకు చేరుకుంది. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని అమరేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శృంగేరి శ్రీ వీరుపాక్ష శ్రీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు గంబీరానంద భారతి మహాస్వామి హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాస్వామి మాట్లాడుతూ పార్థివం అంటే శరీరమని, మన శరీరంతో రూపొందించిన ఈ కోటి పార్థివ శివలింగాలు అభిషేకం శివుడికి అత్యంత ఇష్టమైనదని శివతత్వం అందరూ అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సాసా సతీష్, జీను మణిబాబు, అడబాల భాస్కరరావు, సుంకవిల్లిరాజు, పాలచర్ల సత్యనారాయణ, యల్లమిల్లి సీఎం, గోడే బాల, భక్తజనం పాల్గొన్నారు.

డొంకరాయి పవర్ కెనాల్ పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, ఇతర ఇంజనీర్లు

మోతుగూడెం, ఫిబ్రవరి 29: సీలేరు కాంప్లెక్స్‌లో డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. డొంకరాయి జల విద్యుత్‌కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం విడుదలైన నీరు పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి 16కిలోమీటర్లు పొడవైన పవర్ కెనాల్ ద్వారా అందజేస్తారు. ఈ పవర్ కెనాల్‌కు ఏటా నిర్వహణ పనులు చేపడుతుంటారు. ఈ ఏడాది కూడా పవర్ కెనాల్ నిర్వహణకు అధికారులు అనుమతులు కోరారు. వేసవి ఇబ్బంది దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరి 10నుంచి సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. ఈ నేపథ్యంలో విద్యుదుత్పత్తి ప్రారంభించేలోపే నిర్వహణ పనులకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఈ పనులను సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, సివిల్ ఎస్‌ఈ సివిల్ కేవీ ప్రసాద్‌కుమార్, డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ పరిశీలించారు.

ఆరోగ్యమిత్రలపై బదిలీ కత్తి



- పీహెచ్‌సీ ఆరోగ్యమిత్రలకు పూర్తిగా మంగళం పాడిన వైసీపీ ప్రభుత్వం
- సచివాలయ ఏఎన్ఎంలకు అదనపు బాధ్యతలు అప్పగింత
- ప్రక్షాళన పేరుతో స్థానచలనం?
- 17ఏళ్లుగా చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న ఆరోగ్యమిత్రలు
- పనిచేసే ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేసే యోచన
- పథకం నిర్వీర్యమయ్యే అవకాశం
- ఆందోళనలో ఆరోగ్యమిత్రలు

పేదరికం కారణంగా ఏఒక్కరూ నాణ్యమైన వైద్యానికి దూరం కాకూడదన్న ఉద్దేశంతో అందరికీ ఉచిత కార్పొరేట్ వైద్యం అందేలా మరింత మెరుగ్గా ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా పథకంలో రోజురోజుకూ కొత్తమార్పులు తీసుకువస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు ఇప్పటికే వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో కొన్నేళ్లుగా పీహెచ్‌సీల్లో అరకొర వేతనాలతో పని చేసిన ఆరోగ్యమిత్రలు కనుమరుగయ్యారు. పైగా వారిని నెట్‌వర్క్ మిత్రాలుగా మార్పు చేసేశారు. ఇప్పుడు మళ్లీ వారిని దూర ప్రాంతాలకు బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ పథకం నిర్వీర్యమైపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దాపురం, ఫిబ్రవరి 29: డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలను ఉద్యోగాలనుంచి పొమ్మన కుండా పొగపెడుతోంది వైసీపీ ప్రభుత్వం. ఈఉద్యోగాలనే నమ్ముకుని 17ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రాల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. వారిపై ప్రభుత్వం బదిలీ కత్తిని ప్రయోగించేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. అసలే అరకొర వేతనాలతో నెట్టుకొస్తున్న వారిపై బదిలీ కత్తిని ప్రయోగిస్తారన్న విషయంతో ఆరోగ్యమిత్రలు అయోమయంలో పడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో అయినా తమ బతుకులు బాగుపడతాయని ఆశించి భంగపడడంతో వారికి ఏం చేయాలో తోచడం లేదు. ప్రస్తుతం పనిచేసే ప్రాంతంనుంచి 20 కిలోమీటర్ల పరిధిలో వారిని మార్చేలా ప్రభుత్వం సమాయత్తమవుతునట్లు ఆరోగ్యమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆరోగ్యమిత్రలు గందరగోళంలో పడ్డారు. దీనిపై ఇప్పటికే మిత్రాలనుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిరుద్యోగులపై ఇటువంటి బదిలీ ప్రయోగాలు చేయడం ఏంటని వారు లోలోపల రగిలిపోతున్నారు. ఆరోగ్యమిత్రలను బదిలీ చేస్తే పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

17ఏళ్లుగా చాలీచాలని వేతనాలే..

17 ఏళ్లగా అరకొర వేతనాలకు పనిచేస్తున్న తాము పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు చాలా కష్టపడ్డామని, గ్రామీణ ప్రాంత రోగులకు సైతం ఉచిత కార్పోరేట్ వైద్యాన్ని అందించడానికి తామెంతో చిత్తశుద్ధితో పనిచేసినట్లు ఆరోగ్యమిత్రలు చెబుతున్నారు. తమ కృషివల్ల ఇప్పటివరకూ ఈపథకానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పదుల సంఖ్యలో అవార్డులు వచ్చినట్లు ఆరోగ్యమిత్రలు చెబుతున్నారు. తమకు ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని భావించామని, మళ్లీ ఈ బదిలీ ప్రక్రియను తెరమీదకు తీసుకురావడంతో తమకు ఏంచేయాలో తెలియడం లేదని వారు వాపోతున్నారు.

బదిలీతో పథకం నిర్వీర్యమయ్యే అవకాశం

స్థానికంగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలను ప్రస్తుతం పనిచేసే ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం ద్వారా పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, అర్బన్ హెల్త్ సెంటర్లలో 200మంది వరకూ ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి 79 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా 80మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రులు కలిపి 249 ఆస్పత్రుల్లో రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యమిత్రలు పనిచేసే ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేస్తే చాలీచాలని జీతంతో ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనుకావడమే కాకుండా పథకం అమలు మరింత దిగజారిపోయే ప్రమాదం ఉంది. తమకు ఇచ్చే వేతనంలో కోతలు మినహాయించుకుంటే తమకు చేతికి అందే రూ.13,500 వేతనంతో తాము సుదూర ప్రాంతాలకు వెళ్లి ఏవిధంగా పనిచేయగలమని, పైగా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని, తమకు టీఏ, డీఏలు సైతం లేవని చెబుతున్నారు. తమను ఈవిధంగా వేధించడం ఎంతవరకూ సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. పథకం విజయవంతంగా కొనసాగాలంటే ఎక్కడున్న వారిని అక్కడే ఉంచి, తమకు పూర్తిస్థాయిలో ఉద్యోగ భద్రతను కల్పించాలని ఆరోగ్యమిత్రాలు కోరుతున్నారు. పథకంలో మార్పులు చేస్తే సరిపోతుందని ఆరోగ్యమిత్రాలు భావిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నియమితులైన ఆరోగ్యమిత్రలు ప్రజాపథం, రచ్చబండ, తదితర కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడంతోపాటు ప్రజల్లో పథకానికి మంచి పేరు తీసుకువచ్చేలా కృషి చేశారు. ఆరోగ్యమిత్రలు స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో సత్సంబంధాలు కలిగి ఉండడంతో పథకం మరింత విస్తృతమయ్యే అవకాశం ఉంది.

ట్రస్ట్ నిర్ణయం మేరకే ఏ నిర్ణయమైనా..

ట్రస్ట్ నిర్ణయం మేరకే ఏదైనా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం బదిలీల విషయంపై స్పష్టత ఇంకా లేదు. ప్రస్తుతం ఆరోగ్యమిత్రలు ఎవరెవరు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారన్న విషయంపై వివరాలు సేకరించడం జరుగుతోంది. పీహెచ్‌సీల్లో పనిచేసే ఆరోగ్యమిత్రలను నెట్‌వర్క్ ఆస్పత్రులకు సర్దుబాటు చేశాం. బదిలీ ప్రక్రియపై ఆదేశాలు రావాల్సి ఉంది.

-డాక్టర్ ఎ.రాధాకృష్ణ, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్, కాకినాడ

పెళ్లిరోజునే కడతేర్చాడు

- కాకినాడలోని జగన్నాథపురంలో కిరాతకం
- భర్త చేతిలో భార్య హతం



సంఘటనా స్థలంలో ఉన్న దివ్య మృతదేహం



దివ్య (ఫైల్)



నిందితుడు నూకరాజు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 29: అగ్నిసాక్షిగా తాళికట్టి ఎనిమిదేళ్లయ్యింది. వారికి ముత్యాల్లాంటి ఇద్దరు సంతానం. ఎనిమిదేళ్ల తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకునే పెళ్లి రోజునే అనుమానం పెనుభూతమై భార్యను అత్యంత కిరాతకంగా నరికి హతమార్చాడో కసాయి భర్త. ఈ సంఘటన గురువారం పట్టపగలు కాకినాడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... స్థానిక జగన్నాధపురం, పప్పులమిల్లు సమీపంలోని శ్రీరాంనగర్‌కు చెందిన బొందల దివ్య (26)కు భర్త నూకరాజు, ఫస్ట్‌క్లాస్ చదువుతున్న కుమారుడు ఏడేళ్ల నిహార్, ఎల్‌కేజీ చదువుతున్న నాలుగేళ్ల కుమార్తె నిస్సీ ఉన్నారు. వారిది ఉమ్మడి కుటుంబం కాగా నూకరాజు రేకుల షెడ్‌లకు సంబంధించిన ఫ్యాబ్రికేషన్ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. ఎంతో అనోన్యంగా సాగిన వారి దాంపత్య జీవితంలో అనుమానమనే బీజం నూకరాజు మనస్సులో నాటింది. దానికితోడు అతను తాగుడికి బానిసై తన భార్యను తరచూ మానసికంగా శారీరకంగా హింసించసాగాడు. అయినా దివ్య తన ఇద్దరు పిల్లల కోసం తన భర్త పెట్టే బాధలను దిగమింగుకుంటూ సంసారాన్ని ఈదసాగింది. గురువారం ఆ భార్యాభర్తల ఎనిమిదో పెళ్లిరోజు రానే వచ్చింది. ఎన్నో తీపి జ్ఞాపకాలతో భర్తతో గడుపుదామనుకున్న దివ్యకు ఆమె భర్త మృగంలా ఎదురుపడ్డాడు. ఉదయం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి తన భార్యపై అకారణంగా పిడుగుద్దులు కురిపించాడు. ఆ దాడిని ఆమె తట్టుకోలేక ఇంటి నుంచి బయటకు పరుగుపెడుతుండగా నూకరాజు తనతో తెచ్చుకున్న పదునైన వేట కత్తితో ఆమెను వెంబడించి విచక్షణా రహితంగా ఆమె మెడపై నరికాడు. అదే సమయంలో దివ్య తోటికోడలు తల్లి అడ్డుపడడంతో ఆమెపై కూడా నూకరాజు కత్తితో దాడి చేశాడు. దాంతో ఆమె చేతి వేళ్లు రెండు తెగిపడ్డాయి. దివ్య మెడ భాగం సగం తెగిపోవడంతో ఆమె గిలగిలా తన్నుకుంటూ తీవ్ర రక్త స్రావంతో కుప్పకూలి తనువుచాలించింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ వాడవెల్లి సురేష్‌బాబు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అయితే స్కూల్ నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన పిల్లలు ఇద్దరు అమ్మ అన్నం పెట్టమ్మ అంటూ విగతజీవురాలైన దివ్యను అడుగుతుండడం చూపరుల కంటతడిపెట్టించింది. ఓ పక్క తల్లి లేక మరో పక్క తండ్రి జైలుకు వెళ్లడంతో ఆ చిన్నారుల పరిస్థితి అగమ్య గోచరమైంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు పైపైకి

- కిలో రూ.300 వరకు అమ్మకాలు
- వారం రోజుల్లో కిలో రూ.80లు పెరిగిన ధర



తుని రూరల్/గండేపల్లి, ఫిబ్రవరి 29: చికెన్ ధర కొండెక్కి కూర్చుంది. చికెన్ ధర వారం రోజుల్లో కిలోకు రూ.100 పెరిగింది. దీంతో ప్రస్తుతం కిలో రూ.300 వరకు పలుకుతుంది. చికెన్‌ధరలు గణనీయంగా పెరగడానికి కారణం కోళ్ళ ఉత్పత్తులు తగ్గడమే కారణమని కోళ్ల నిర్వాహకులు, వ్యాపారులు అంటున్నారు. మార్చి, ఏప్రిల్‌లలోకూడా ఇదే పరిస్థితి కొనసాగేలా ఉంది. గుడ్డు ధర కూడా ఇలాగే కొనసాగుతుంది. బహిరంగ మార్కెట్‌లో రూ.5నుంచి రూ.7 వరకు అమ్మకాలు జరుపుతున్నాయి. కార్తీకమాసం సమయంలో కోడిమాంసం ధరలు భారీగా పడిపోవడం, కేజీ రూ.130కే అమ్మిన పరిస్థితులు ఏర్పడటంతో అప్పట్లో కోళ్లఫారాల యాజమాన్యాలు నష్టాలు చవిచూడడంతోపాటు ఇతర జిల్లాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు వెలుగుచూడడంతో కోళ్ల పెంపకందారులు పెంపకాన్ని ఒక్కసారిగా తగ్గించేశారు. మార్కెట్‌లో అయోమయం పరిస్థితులు తలెత్తడంతో తల్లికోళ్ళను కూడా గిట్టుబాటు కాక అమ్మేశారు. ఫలితంగా ఉత్పత్తి తగ్గి కోళ్ళ కొరతతో మాంసానికి డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో చికెన్ ధరలు అంతకంతకూ పెరుగుతూ వస్తున్నాయి. హోల్‌సేల్‌గా కోళ్ళ ధర రూ.70 నుంచి రూ.80లకు ఎవచ్చేదని అయితే ఈ వారం రోజుల వ్యవధిలోనే కిలో హోల్‌సేల్‌గా రూ.140 నుంచి రూ.150లకు పెరిగిందని, దీంతో మాసం కిలో రూ.280 నుంచి రూ.300లకు గిట్టుబాటు కాదని వ్యాపారులు అంటున్నారు.

దీక్ష విరమించిన సూర్యచంద్ర

గోకవరం, ఫిబ్రవరి 29: గోకవరం మండలం అచ్యుతాపురంలో ఆరు రోజులుగా అంతిమ ఆమరణ నిరాహారదీక్ష పేరుతో ఆందోళనకు దిగిన జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర దంపతులు గురువారం తమ దీక్షను విరమించారు. జనసైనికుల కోరిక మేరకు తాము స్వచ్ఛందంగా నిరసన దీక్షను వీడుతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సూర్యచంద్ర మాట్లాడుతూ జగ్గంపేట సీటు దక్కక పోయినప్పటికీ తనకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై ఎటువంటి కోపతాపాలు లేవన్నారు. అయితే తాను నాలుగేళ్లుగా పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించినా సీటు ఎందుకు నిరాకరించారో అర్థం కావడం లేదన్నారు. ఎప్పటికైనా తాను అసెంబ్లీలో అడుగు పెడతానని సూర్యచంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లో జనసైనికులతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

అవినీతి అధికారికి
మూడేళ్ల జైలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారికి కోర్టు జైలు శిక్ష విధించింది. అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) డీఎస్పీ డి.శ్రీహరిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల్లోని రేషన్ దుకాణాలకు మండపేట నుంచి నిత్యావసర వస్తువులు సరఫరా చేయడానికి వర్క్ ఆర్డర్ కోసం తన కుమారుడిని కాకినాడలోని పౌరసరఫరాలశాఖలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ముడుగు జాన్ కెన్నడి రాజ్‌కుమార్ లంచం అడుగు తున్నారని పెనికేరుకు చెందిన వైట్ల వెంకట్రావు ఫిర్యాదు చేశారు. 2016 సెప్టెంబరు 23న వెంకట్రావువద్ద నుంచి రాజ్‌కుమార్ రూ.20వేలు లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరంలోని ఏసీబీ కేసుల ప్రత్యేకకోర్టు నేరస్తుడికి గురువారం మూడేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి.శేషయ్య, ఎంవీ దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారని.. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేశారని డీఎస్పీ తెలిపారు.

సత్యదేవుడికి రూ.20కోట్లు ప్రసాద్ స్కీం నిధులు

- మంజూరు చేస్తూ కేంద్రం ఆదేశాలు



అన్నవరం ఫిబ్రవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యదేవుడి ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వ పథకం అయిన ప్రసాద్ స్కీం నిధులు ఎట్టకేలకు మంజూరయ్యాయి. దాదాపు 8ఏళ్లుగా ఈ పథకం నిధులు కోసం భక్తులు, అధికారులు ఎదురుచూస్తున్నారు. 2015లో దీనిపై ప్రతిపాదన పంపించాలని కేంద్ర టూరిజం అధికారులు లేఖ రాయడంతో రాష్ట్ర టూరిజం అధికారులు దేవస్థానం అధికారులు రూ.92కోట్ల పనులకు ప్రతిపాదన పంపించారు. వీటిని తగ్గించి పంపించాలని రూ.50కోట్లు మాత్రమే వస్తాయని తెలపడంతో మరోసారి కొన్ని పనులు తీసివేసి రూ.50కోట్లకు అంచనాలు పంపించారు. దీనిపై ఆశలు వదులుకున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటితో ప్రధానంగా అన్నదాన భవనం నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు. దీనికి రూ.10కోట్లు వ్యయం కానుండగా మిగిలిన రూ.10కోట్లతో అత్యవసర పనులకోసం ఛైర్మన్, సభ్యులతో ఈ నెల 7న జరిగే పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయిస్తారు.

టమాటా నేలచూపులు

- కిలో రూ.5కు పడిపోయిన ధర



గండేపల్లి, ఫిబ్రవరి 29: ప్రస్తుత పరిస్థితుల్లో టమాటా నేల చూపులు చూస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.5 పలుకుతూ రైతులకు నష్టాన్ని మిగుల్చుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కోత కూలి రావడం లేదని ఆవేదన చెందుతున్నారు .ఇదే టమాట 8నెలలు కిందట కిలో రూ.200కు పైగా ధర పలికి రైతులకు లాభాలు తెచ్చిపెట్టడంతో పాటు కొనుగోలుదారులకు చుక్కలు చూపించిన సంగతి తెలిసిందే. ఈ టమాటలకు అప్పట్లోసెక్యూరిటీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన పరిస్థితులు ఉన్నాయి. అయితే రానురాను ఈ టమాటా సాగు పెరగడంతో ధర దపదపాలుగా తగ్గికుంటూ వచ్చింది. మధ్యమధ్యలో ధర పెరిగినప్పటికీ ప్రస్తుతం కిలో ధర రూ.5లకు పడిపోయింది.దీంతో రైతులు నష్టాలు ఎదుర్కొంటున్నామంటున్నారు. మళ్లీ ఈ టమాటా ఎప్పుడు లాభాల్లోకి తీసుకువెళుతుందోనని రైతులు ఆశగా చూస్తున్నారు. అయితే రైతులకు లాభాలు రానప్పటికీ రీసెల్ వ్యాపారులు, చిరు వ్యాపారులు కిలో రూ.30లు పైగా అమ్ముకుంటూ లాభాలు పొందుతున్నరని చెప్పవచ్చు.

ఊపందుకున్న డిజిటల్ పేమెంట్‌లు

- సన్నగిల్లిన కరెన్సీ చలామణి
- రూ.10 కమీషన్‌పై ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న వ్యాపారులు
- ఎక్కడికక్కడ ఫోన్‌పే చేసి నగదు పొందుతున్న వినియోగదారులు

కరప, ఫిబ్రవరి 29: మారుతున్న కాలంతోపాటు డిజిటల్ పేమెంట్‌లు ఊపందుకుంటున్నాయి. దీంతో కరెన్సీ చలామణి సన్నగిల్లుతోంది. ఇదే అదునుగా రూ.10 కమీషన్‌పై కొందరు వ్యాపారులు ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడిలో ఒక ఇంటి ముందు ఫోన్‌పే చేయబడును అనే ఫ్లెక్స్‌ను ఏర్పాటుచేశారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఇళ్ల వద్ద ఫ్లెక్స్‌లు ఏర్పాటు చేసి మరీ ఈ వ్యాపారాలు చేస్తున్నారు. బడ్డీ కొట్టు నుంచి మాల్స్ వరకు ప్రతి కొనుగోలుకు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్‌లను వినియోగిస్తున్నారు. రూపాయినుంచి వందలు, వేలల్లో చేసే కొనుగోళ్లకు పేమెంట్ యాప్‌ల స్కానర్స్‌ను ఉపయోగించి క్షణ కాలంలో బిల్లులు చెల్లిస్తున్నారు. వీటితోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల వినియోగించేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జేబు దొంగలు, చిల్లర సమస్య నుంచి విముక్తి, ఇతర పలు రకాల ప్రయోజనాలు ఉండడంతో డిజిటల్ లావాదేవీలు చేసేందుకు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో అధిక శాతం మంది చేతిలో సెల్, జేబులో కార్డులు తప్ప కరెన్సీ తీసుకెళ్లడానికి ఇష్టపడడంలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది తమ వ్యాపార దృక్పథాన్ని ప్రదర్శించి ఎక్కడికక్కడ ఫోన్‌పే ఫ్లెక్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పేమెంట్ యాప్‌ల్లో డబ్బులు వేయాలన్నా లేక నగదు కావాలన్నా కమీషన్ తీసుకుంటూ తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. అది ఎటువంటి లావాదేవి అయినా, ఎంతైనా సరే ఒక వెయ్యికి రూ.10 చొప్పున కమీషన్‌గా తీసుకుంటూ రెండు చేతుల సంపాదిస్తున్నారు. ఈ ఐడియా బాగుండడంతో ఎక్కడికక్కడ పలువురు కిరాణా, ఫ్యాన్సీ దుకాణదారులతోపాటు ఔత్సాహికులు ఈ తరహా వ్యాపారానికి తెరదీస్తున్నారు. పెదపూడి మండలం కాండ్రేగుల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పది రూపాయల కమీషన్ పై లక్షలాది రూపాయల డిజిటల్ లావాదేవీలు నిర్వహించడంతో ఇటీవల ఐటీశాఖ నుంచి అతడు నోటీసులు అందుకున్నట్టు తెలిసింది. డిజిటల్ పేమెంట్స్ యాప్‌లను ఉపయోగించి సరికొత్త వ్యాపారానికి శ్రీకారం చుట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది.



కరప : గొర్రిపూడిలో ఒక ఇంటి వద్ద ఫోన్‌పే చేయబడునని ఏర్పాటుచేసిన ఫ్లెక్స్

కాకినాడ

'బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి'

ఏలేశ్వరం, ఫిబ్రవరి 29: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లిబరేషన్ పార్టీ లక్ష్యమని జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పేర్కొన్నారు. గురువారం లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీకి మద్దతు పలికే ప్రాంతీయ పార్టీలను ఓడించాలంటూ ఏలేశ్వరంలో ర్యాలీ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో లిబరేషన్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాకర రత్న కుమారి, జి.వీరబాబు, ఎస్. అప్పలరాజు, నాగేశ్వరరావు, కార్యకర్తలున్నారు.

'80 సీట్లు, రెండేళ్లు సీఎం అడగాల్సింది'

కిర్లంపూడి, ఫిబ్రవరి 29: టీడీపీతో పొత్తులో పవర్ షేరింగ్‌లో భాగంగా 80 శాసనసభ సీట్లు, రెండేళ్లపాటు ముందుగా ముఖ్యమంత్రి పదవి కావాలని అడిగి ఉండాల్సిందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సూచన చేశారు. కానీ మీరు ఆ సాహసం చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. కిర్లంపూడిలోని తన స్వగృహంలో గురువారం ముద్రగడ విలేఖరులకు ఈ లేఖను అందించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన ఉమ్మడి ఎన్నికల సభలో పొత్తులు, సీట్లపై జనసేనాని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యల నేపథ్యంలో ముద్రగడ ఈ లేఖ రాసినట్టు తెలుస్తోంది. లేఖ సారాంశం ప్రకారం.. 2019 ఎన్నికల ముందు కవాతు సందర్భంగా కిర్లంపూడి వస్తానని కబురు పంపారని, అయోధ్య వెళ్లి వచ్చిన తర్వాత మరొకసారి వస్తానని కబురు పంపారని, ఎటువంటి కోరికలు లేకుండా మీతో కలుస్తానని చెప్పానని తెలియజేశారు. అన్ని వర్గాల వారికీ న్యాయం జరగడం కోసం పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేయాలని, ఎటువంటి ఫలితం ఆశించకుండా మీతో కలిసి పనిచేయాలనుకున్నానని అన్నారు. ఇద్దరి కలయిక జరగాలని యావత్ జాతి ఎంతో ఎదురుచూసినా దురదృష్టవశాత్తూ తనకు మీరు అవకాశం కల్పించలేదని అన్నారు. మీ నిర్ణయాలు మీ చేతుల్లో ఉండవని, ఎన్నోచోట్ల అనుమతులు పొందాలని అన్నారు. మీ పార్టీలో పోటీ చేసే 24 సీట్ల కోసం తన అవసరం రాకూడదని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

'రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టిన జగన్'

తుని రూరల్, ఫిబ్రవరి 29: ఒక్క ఛాన్స్‌తో రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల అన్నారు. రాష్ట్ర భవిష్యత్ అంధకారంలోకి నెట్టి అవినీతి అక్రమాలతో పేట్రేగిపోతున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. తాళ్ళూరులో ఇంటింటా ప్రచారాన్ని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి చేపట్టారు. పార్టీ మేనిఫెస్టో పత్రాలు అందజేస్తూ టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేష గిరిరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, ఎన్. సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగసోమరాజు, రామునాయుడు పాల్గొన్నారు.

'సేవా తత్పరుడు వరుపుల రాజా'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 29: ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మదిలో చెరగమని ముద్ర వేసుకున్న సేవా తత్పరుడు దివంగత నేత వరుపుల రాజా అని పారిశ్రామికవేత్త, సానా ఫౌండేషన్ ఛైర్మన్ సానా సతీష్‌బాబు అన్నారు. ప్రత్తిపాడు తోటవీధిలోని రాజా స్వగృహానికి గురువారం విచ్చేసి రాజా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజాను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, బద్ది రామారావు, పైలా సాంబశివరావు, ఇతంశెట్టి భాస్కరబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, వెన్నా శివ, మూది నారాయణ స్వామి, బద్ది వెంకటరమణ, పసగడుగుల రమణ, సూది బూరయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోటనందూరు మండలం పాతకొట్టం గ్రామానికి చెందిన కందికట్ల నూకరాజుకు మెరుగైన వైద్యం నిమిత్తం ప్రముఖ సామాజికవేత్త సానా సతీష్ రూ.50 వేలు సాయాన్ని ఆయన కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులున్నారు.

'వైసీపీ రాక్షస పాలన నుంచి కాపాడాలి'

ఏలేశ్వరం, ఫిబ్రవరి 29: యువత ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాన్ని వైసీపీ రాక్షస పాలన నుంచి కాపాడాలని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. గురువారం ఏలేశ్వరంలో వేంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఓట్ ఫర్ సీబీఎన్ సమావేశానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపెళ్ల రాజేష్ హాజరై మాట్లాడుతూ యువత రాజకీయల్లోకి రావాలని, ఆలోచించి ఓటు వెయ్యాలన్నారు. అనంతరం వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, చిక్కాల లక్ష్మణరావు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

'రాజ్యాధికారం దిశగా కదలాలి'

తొండంగి, ఫిబ్రవరి 29: బహుజనులు రాజ్యాధికారం దిశగా కదలాలని బీఎస్పీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జి తంతటి కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన శృంగవృక్షం గ్రామంలో దళిత నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఇప్పటికి ఆధిపత్య కులాల జెండాలను మోసే స్థాయిలోనే దళితులు ఉండడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా చైతన్యవంతమై దళిత, బీసీ మైనార్టీ వర్గాలంతా ఏకమై రాజ్యాధికారాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో పెయ్యల సూర్యారావు, కర్రి నూకరాజు, బిచత్ర రావు,గంగరాజు, అప్పలరాజు, నూకరాజు, అప్పారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానికేతరులకు ఇళ్ల పట్టాలిస్తే సహించం'

తాళ్లరేవు, ఫిబ్రవరి 29: చొల్లంగిలో ఇళ్ల పట్టాలను స్థానికేతరులకు ఇస్తే సహించేది లేదని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు హెచ్చరించారు. ఇళ్ల పట్టాలు స్థానికులకే ఇవ్వాలని లబ్ధిదారులు చేపట్టిన దీక్షలు గురువారం 30వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేకు తన సామాజిక వర్గం మీద ఉన్న ప్రేమ ఇతర వర్గాల మీదలేదని అందుకే స్థానికేతులకు పట్టాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించాలన్నారు.

మెట్రాలజీశాఖ ప్రత్యేక తనిఖీలు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 29: లీగల్ మెట్రాలజీశాఖ కంట్రోలర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లాలో అధికారులు 4 ప్రత్యేక బృందాలు ఏర్పడి తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, రైస్, ఐరన్, స్టీలు, కూల్‌డ్రింక్స్, తినుబండారాలు విక్రయించే దుకాణాలపై దాడులు నిర్వహించారు. తక్కువ తూకంలో ఇనుము అమ్మకంపై 1, తక్కువ తూకం బియ్యం బస్తాల అమ్మకంపై 1, ఎమ్మార్పీ కంటే ఎక్కువగా కూల్‌డ్రింక్స్ అమ్ముతున్నందుకు 2, అమ్మకపుధర, తయారుతేదీ, చిరునామా తదితర వివరాలు లేనందున 13కేసులు, ముద్రలులేని ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగిస్తున్నందున 3కేసులు నమోదు చేశారు. కాకినాడ ఉపనియంత్రికులు ఎస్.జనార్ధరావు ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో సహాయనియంత్రికులు శామ్యూల్‌రాజు, సలీం, ఇన్‌స్పెక్టర్లు సరోజిని, ప్రసాద్, శివబాలాజీ, కుటుంబరావు, నాగేంద్రకుమార్, మోహన్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు కమిటీ

పిఠాపురం, ఫిబ్రవరి 29: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు గానూ ఉత్సవకమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా ఆగంటి ప్రభాకరరావు, దంగేటి ఆదినారాయణ, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, గ్రంధి వెంకట గణేష్, పిల్లా శ్రీనివాసరావు, వడిశెట్టి గాయత్రి, బండి శారద, కోశిరెడ్డి సత్యనారాయణ, నల్లమల్లి ముత్యాలరావు నియమితులయ్యారు. సభ్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ సూచించారు. సభ్యులు, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ

కోటనందూరు, ఫిబ్రవరి 29: మండలంలోని జగన్నాధపురం గ్రామంలో రూ.కోటితో నిర్మించిన శ్రీహనుమాన్ సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 3రోజులపాటు గణపతిపూజ, పుణ్యావచనం, మండప పునఃపూజ, ధాన్యదివానము చతుర్వేదస్వస్తినీరాజన మంత్రపుష్పము తదితర కార్యక్రమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడుగాడి రాజుబాబు, డి.చిరంజీవిరాజు, అంకంరెడ్డి రమేష్, షేక్‌నవాబ్‌జానీ, యర్ర చినసత్యనారాయణ పాల్గొన్నారు.

సీనియర్ రాజకీయవేత్త నారాయణస్వామి మృతి

కొత్తపల్లి, ఫిబ్రవరి 29: వాకతిప్పకు చెందిన సీనియర్ రాజకీయవేత్త జ్యోతుల నారాయణస్వామి (95) గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయన కొత్తపల్లి శ్రీరాజశేఖరస్వామి ఆలయ చైర్మన్‌గా... వాకతిప్ప, కొత్తపల్లి పంచాయతీల సర్పంచ్‌గాను పలు పదవులు అలంకరించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, వాకతిప్ప సర్పంచ్ పాలాని దొరబాబు, మాజీ సర్పంచ్ జ్యోతుల సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు జ్యోతుల లక్ష్మణరావు స్వామికి నివాళులర్పించారు.

సైన్స్‌ఫెయిర్ విజేతగా లక్ష్మణ్

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 29: పిఠాపురంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న జి.శ్రీసురేంద్రలక్ష్మణ్‌కు ప్రథమ బహుమతి లభించింది. అతడికి ల్యాప్‌ట్యాప్‌తో పాటు స్వర్ణ పతకాన్ని సామాజిక కార్యకర్త మురాలశెట్టి సునీల్‌కుమార్ అందజేశారు. లక్ష్మణ్‌ను, అతడికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులును ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్ అభినందించారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

సామర్లకోట, ఫిబ్రవరి 29: మండల తహశీల్దార్‌గా నియమితులైన వై.శ్రీనివాస్ గురువారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

» పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు



పిఠాపురంలో పరీక్షలకు సిద్ధమైన తరగతి గది

పిఠాపురం, ఫిబ్రవరి 29: ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నియోజకవర్గంలోని విద్యార్థులు పరీక్షలు రాసే నిమిత్తం పిఠాపురంలో 3, కొత్తపల్లిలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మార్చి 15వ తేది వరకూ ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ జరగనున్నాయి. పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, హనుమంతరాయ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్‌కళాశాల, కొత్తపల్లిలోని వీవీఎస్ జూనియర్ కళాశాల్లో జరిగే ఈ పరీక్షలకు 1550మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీఆర్‌పీసీ 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. ఇంటర్‌పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా నియమితులైనవారికి ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. విద్యార్థులు నిర్దేశించిన సమయం కంటే అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు.

ఏలేశ్వరం: ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ గురుకుల విద్యాసంస్థల్లో శుక్రవారం నుంచి ఇంటర్ మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.బాబ్జి తెలిపారు. పట్టణంలో 2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ప్రథమ సంవత్సరం 773 మంది విద్యార్థులు, శనివారం నుంచి ద్వితీయ సంవత్సరం 660 మంది హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలన్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు సర్వం సిద్ధం చేసినట్టు చీఫ్ సూపరిడెంట్‌లు బాబ్జి, జయలక్ష్మి, డిపార్ట్‌మెంట్ అధికారులు పి.రామకృష్ణ, ఎ.ప్రతాప్ తెలిపారు.

'విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 29: ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల భద్రతకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలని పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను గురువారం స్థానిక పోలీసులకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభవుతున్న నేపథ్యంలో ద్విచక్రవాహనాలు, ఆటోలపై స్థానిక జాతీయరహదారిపై ఉన్న పరీక్ష కేంద్రాలకు వచ్చే విద్యార్థుల రక్షణ కోసం అధికారులు పటిష్టమైన చర్యలుచేపట్టాలన్నారు. స్థానిక ఫారెస్ట్ చెక్‌పోస్టు, నరేంద్ర గిరి జంక్షన్, గోవిందపురం కొండ జంక్షన్, రాచపల్లి అడ్డురోడ్డు సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్షలు రాసే విద్యార్థులు ప్రమాదాలు బారిన పడకుండా రక్షణచర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వం

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప » ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

పెద్దాపురం, ఫిబ్రవరి 29: రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గురువారం స్థానిక సుధా కాలనీలో క్యాంపు కార్యాలయం వద్ద కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. త్వరలో మంచి రోజులు రాబోతున్నాయని టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడబోతోందన్నారు. పార్టీలోకి చేరేందుకు ఎవరు ముందుకొచ్చినా వారిని సాదరంగా ఆహ్వానించి చేర్చుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారం ఏవిధంగా చేపట్టాలి, ఎలా ముందుకు సాగాలనే విషయాలపై కార్యకర్తలతో చర్చించారు. జనసేన నాయకులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని, ఎక్కడా కూడా లోపించకుండా చూసుకోవాలన్నారు. అలాగే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు చెప్పాలని సూచించారు. తనకు మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిన చంద్రబాబు, లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, కాకినాడ రామారావు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), నిమ్మకాయల రంగనాగ్, ఎలిశెట్టి నాని పాల్గొన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా చినరాజప్ప పేరును మరోసారి అధిష్టానం ఖరారు చేయడంతో ఎన్నికల ప్రచారానికి గురువారం ఆయన శ్రీకారం చుట్టారు. పెద్దాపురంలో ప్రముఖ ఆలయాల్లో ఆయన అనుచరులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రచార రథంపై ప్రచారం చేపట్టారు. ప్రజల వద్దకు వెళ్లి తనను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

టీడీపీలో చేరికలు

స్థానిక పాతబస్టాండ్ వద్ద పద్మనాభా కాలనీ, కుమ్మరివీధికి చెందిన సుమారు 100 మంది టీడీపీలో చేరగా వారికి రాజప్ప కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, రాజాసూరిబాబురాజు, తూతిక రాజు, కొరిపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం: శృంగారవల్లభస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 29: ఎమ్మెల్యే చినరాజప్ప ఎన్నికల ప్రచారం శ్రీకారం చుట్టారు. ముందుగా టీడీపీ నాయకులతో కలిసి సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి చేరుకోగా ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం తదితర పండితులు సాదరంగా స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామికి అభిషేకపూజలు, బాలాత్రిపుర సుందరిఅమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నంది మండపం వద్ద పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరులచే వేదస్వస్తిపలికి ప్రసాదాలు అందజేశారు. అనంతరం మెహెర్ కాంప్లెక్స్ వద్ద లక్ష్మీగణపతి ఆలయంలో పండితులు తురుమళ్ళ శేషకుమార్ ఆధ్వర్యాన జరిగిన విశేషపూజల్లో రాజప్ప పాల్గొన్నారు.



నగరపాలకసంస్థకు పుష్‌కార్ట్సు అందిస్తున్న జేసీ

రెడ్‌క్రాస్ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం : జేసీ

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 29: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సత్సంకల్పంతో రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు సంభవించే సమయాల్లో తీసుకోవలసిన రక్షణ చర్యలపై గురువారం సుమారు 850మంది సచివాలయ ఉద్యోగులకు రెడ్‌క్రాస్ ప్రాణమిత్ర వలంటీర్స్ పేరుతో శిక్షణ ఇచ్చారు. ఓఎన్‌జీసీ సహకారంతో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ 3 రోజులపాటు ఈ ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. జేసీ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలనే దృక్పథాన్ని ప్రతీఒక్కరూ అవరుచుకోవాలన్నారు. కమిషనర్ జె.వెంకటరావు, ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుపమ్, రెడ్‌క్రాస్ చైర్మన్ వైడి రామారావు తదితరులు మాట్లాడారు.

పుష్‌కార్ట్సు సమకూర్చిన ఓఎన్‌జీసీ

కాకినాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగానికి రూ.10లక్షలతో 70 పుష్‌కార్ట్సును ఓఎన్‌జీసీ సంస్థ సమకూర్చింది. జేసీ ప్రవీణ్ ఆదిత్య నగరపాలక సంస్థకు అందజేశారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రాణమిత్ర వలంటీర్లున్నారు.

'ఆవేదన కలిగిస్తున్న సూర్యచంద్ర ప్రవర్తన'

జగ్గంపేట, ఫిబ్రవరి 29: జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర ప్రవర్తన ఆవేదన కలిగిస్తుందని సూర్యచంద్ర అన్నయ్య, జనసేన క్రియాశీలక సభ్యుడు పాఠంశెట్టి బాబ్జి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పొత్తులో భాగంగా టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూను ప్రకటించిన వెంటనే పాదయాత్ర చేసిన నా తమ్ముడు సూర్యచంద్ర నెహ్రూకు ఎన్నికల్లో మద్దతు ఇవ్వనని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. వార్డు స్థాయి నుంచి సర్పంచ్, మండల నాయకుడుగా చేసింది జ్యోతుల నెహ్రూ, అలాగే ఒక ఎమ్మెల్యే అభ్యర్థి స్థాయి నుంచి రాష్ట్రస్థాయి నాయకుడిగా నిన్ను తీసుకొచ్చింది జనసేన అధ్యక్షుడు పవన్ అలాంటి వారిని దుర్భాషలాడడం నీ అవివేకమని నీ వల్ల మన పాఠంశెట్టి వారందరూ కూడా ఏ విధమైన ఫంక్షన్లకు వెళ్ళలేని స్థితిలో ఉన్నారని, ఎక్కడకెళ్లిన ఎన్నారైల దగ్గర మీ వాడు కోట్ల రూపాయిలు దండుకున్నాడని ఆక్షేపన చేస్తుంటే చాలా బాధగా ఉందని బాబ్జి ఆవేదన చెందారు.

'మా నాయకుడిని విమర్శిస్తే ఊరుకోం'

జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కుంచే రాజా, జీను మణిబాబు విలేకర్లతో మాట్లాడుతూ పాఠంశెట్టి సూర్యచంద్ర మతిభ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఆరోగ్యం బాగోకపోతే ఆస్పత్రిలో చేరు అంతేకాని మా నాయకుడు జ్యోతుల నెహ్రూని కానీ.. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను విమర్శిస్తే ఊరుకోమన్నారు. నీ నటనతో ప్రజలను మోసం చేస్తే మోసపోవడానికి ఎవరు సిద్ధంగా లేరని పేరొన్నారు.

'పారిశుధ్యంపై దృష్టి సారించాలి'

పెద్దాపురం, ఫిబ్రవరి 29: పారిశుధ్యంపై దృష్టి సారించాలని మున్సిపల్ అధికారులను కౌన్సిల్ నిలదీసింది. స్థానిక కౌన్సిల్ సమావేశపు మందిరంలో చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ అరెళ్ల వీర్రాఘవరావు మాట్లాడుతూ వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ చేపట్టడంలేదని ఎక్కడిక్కడ పారిశుధ్యం పేరుకుపోతోందని, దీంతో ప్రజలు తమను నిలదీస్తున్నారన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ మేజర్ డ్రైనుల్లో సిల్టు తొలగించాలన్నారు. కౌన్సిలర్ పప్పల దుర్గారావు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని, ఫాగింగ్ చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కమిషనర్ కేవీ పద్మావతి, ఆర్‌వో చంద్రశేఖర్, మేనేజర్ జ్యోతీరాణీ, డీఈ ఆదినారాయణ తదితరులున్నారు.

టిడ్కో లబ్ధిదారులపై వైసీపీ కక్ష సాధింపు

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 29: టిడ్కో అపార్ట్‌మెంట్లులో నివాసముంటున్న వారికి కనీస సదుపాయాలు కల్పించకుండా వైసీపీ ప్రభుత్వం కక్ష సాధిస్తుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం గోర్స రోడ్డులో గల టిడ్కో అపార్ట్‌మెంట్లను ఆయన గురువారం పరిశీలించారు. అపార్ట్‌మెంట్లలో అడుగడుగునా సమస్యలే ఉన్నాయని, డ్రెయిన్లల్లో పూడిక పేరుకుపోయిందని, పలు అపార్ట్‌మెంట్లుకు ఇంకా విద్యుత్ సౌకర్యం కల్పించలేదని, చీకటిలో మగ్గుతున్నామని లబ్ధిదారులు వర్మకు మొరపెట్టుకున్నారు. అపార్ట్‌మెంట్లు వద్ద పాముల బెడద అధికంగా ఉందని, పాముకాటుకు గురై ఇద్దరు చనిపోయారని తెలిపారు. వర్మ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అపార్ట్‌మెంట్లును లబ్ధిదారులకు అప్పగించారని, అయితే సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. అపార్ట్‌మెంట్లులో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు అందరికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకుంటే మున్సిపల్, విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, గోర్ల సత్తిబాబు, పిల్లి రవికుమార్, కోళ్ల బంగారుబాబు, కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీను, దుర్గాడ విజయలక్ష్మి, తిరుమలరావు, దాసం ప్రసాద్, వాసంశెట్టి సూరిబాబు ఉన్నారు.



టిడ్కో అపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న వారి సమస్యలు తెలుసుకుంటున్న వర్మ

'ఇళ్ల పట్టాలు మంజూరు'

ఉప్పాడ (కొత్తపల్లి), ఫిబ్రవరి 29: రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామాలకు ఆనుకొని పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి రుణ సదుపాయం కల్పిస్తారని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి వర్మ సతీమణి లక్ష్మీదేవి తెలిపారు. ఉప్పాడ శివారు మాయాపట్నంలో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమంలో ఆమె మత్స్యకారమహిళలకు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మత్స్యకార నేత చోడిపల్లి ప్రసాద్, ఓసిపల్లి అప్పన్న, మహిళా నాయకురాలు మూగి సత్యవతి, మహిళలున్నారు.

టీడీపీ-జనసేన కూటమితో వైసీపీలో బీటలు

మాజీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 29: తాడేపల్లిగూడెంలో జరిగిన తెలుగు జన విజయకేతన జెండా సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లుతోందని, తెలుగుదేశం-జనసేన పార్టీల కూటమితో వైసీపీలో బీటలు ప్రారంభమయ్యాయని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు, ఆ పార్టీ నాయకుల దందాలకు వ్యతిరేకంగా టీడీపీ-జనసేన పార్టీలు పోరాడుతూ ప్రజల పక్షాన అండగా నిలుస్తున్నాయన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం, అధికారం కోసం ఈ రెండు పార్టీలు కలువలేదన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశం-జనసేనలు కలిసి ముందుకు వెళ్తున్నాయన్నారు. ప్రజల సొమ్మును దోచుకుని జగన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాడన్నారు. రానున్న తెలుగుదేశం-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు, యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. ఈ కూటమి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించనుందని కొండబాబు పేర్కొన్నారు.

మాట తప్పిన జగన్‌రెడ్డి

గత ఎన్నికల ముందు జగన్‌రెడ్డి సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని, అలాగే మద్యపాన నిషేధం చేసిన తర్వాతే మళ్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెప్పి ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పుడు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాడని టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మద్యం రేట్లు మూడు రెట్లు పెంచి నాసిరకం మద్యం అమ్మిస్తూ ప్రజల ఆరోగ్యాలను గుల్ల చేస్తున్నాడన్నారు. ఈ నాసిరకం మద్యం తాగడం వల్ల కొన్ని లక్షల మంది ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన కూటమి విజయకేతనం ఎగురవేసి ఉమ్మడి ప్రభుత్వం ద్వారా ప్రజా సంక్షేమ పాలన అందించనున్నాయని తెలిపారు.

కాకినాడలో భవన నిర్మాణ కార్మికుల ధర్నా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 29: భవన నిర్మాణ కార్మికుల నిధులు దోచుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ కాకినాడ ఇంద్రపాలెం వంతెన అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఒకే తరహాలో భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో ఇచ్చిన పిలుపులో భాగంగా చేపట్టిన ఈ ధర్నాకు భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి అన్నవరం అధ్యక్షత వహించారు. ధర్నాను ఉద్దేశించి ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి, రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న నిధులు తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలని లేకపోతే ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులు ఈ ప్రభుత్వాన్ని ఓడించడానికి చైతన్యపరుస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోనే 2045 క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులకు సుమారు రూ.4కోట్ల 62 లక్షలు పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు మోసం చేస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు పప్పు ఆదినారాయణ, ఎంఎస్ అర్జునరావు, శేఖర్, బాబూరావు, బాష, ఈశ్వరరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

శివారు ప్రాంతాలకు సాగునీరందేలా చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్



రైతులతో మాట్లాడుతున్న విజయకుమార్

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 29: శివారు ప్రాంతాలకు ప్రణాళికాబద్ధంగా సాగునీరందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పిఠాపురం మండలం పి.దొంతమూరు, పి.రాయవరం తదితర గ్రామాల్లో విజయకుమార్, ఏలేరు ఇరిగేషన్ ఈఈ రామగోపాల్ గురువారం పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. సాగునీరు విడుదలవుతున్నా శివారు ప్రాంతాలకు నీరు చేరడంలో సమన్వయ లోపం ఉన్నట్టు గుర్తించారు. దీంతో గ్రామాల వారీగా ఇద్దరు అభ్యుదయ రైతులు, వీఏఏ, వీఆర్వో, పోలీసులు, లస్కర్‌లతో కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాగునీటి పంపిణీని ఈ కమిటీలు క్రమబద్ధీకరిస్తాయని తెలిపారు. కమిటీల ఏర్పాటుపై కాకినాడ ఎంపీ గీత, ఆర్డీవో కిషోర్‌తో చర్చించినట్టు చెప్పారు. పిఠాపురం ఏడీఏ వి.స్వాతి, ఏవో అచ్యుతరావు, ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాసకుమార్ తదితరులున్నారు.

ఉప్పపాలెంలో గ్రామస్తుల నిరసన

రౌతులపూడి, ఫిబ్రవరి 29: క్రషర్ల నుంచి లారీలు వెళ్లేటప్పుడు వచ్చే దూళిని భరించలేకపోతున్నామని ఉప్పపాలెం గ్రామస్తులు ఉపసర్పంచ్ చిపురపల్లి తాతాజీ, పంచాడ శ్రీను, పంచాడ రమణబాబు, శీరంరెడ్డి సత్తిబాబు, గారారాజు, గ్రామస్తులతో కలిసి లారీలు, ట్రాక్టర్లను నిలిపి వేసి గురువారం నిరసన తెలిపారు. క్రషర్లు, లారీలు నుంచి వచ్చే దూళివల్ల అనారోగ్యం బారినపడుతున్నామన్నారు. నిత్యం వందలాది లారీలు తిరుగుతున్నాయని, నిత్యం వాట రింగ్ చేసి దూళి రేగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

సత్యదేవుని రథయాత్ర

ఏలేశ్వరం, ఫిబ్రవరి 29: ఏలేశ్వరంలో గురువారం సత్యదేవుని రథయాత్రను పండూరి నరసింహమూర్తి రథాన్ని ఏర్పాటు చేసి నిర్వహించారు. రథంలో శ్రీఅనంతలక్ష్మీ సమేత శ్రీ వీరవెంకటసత్యన్నారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి బాజా భజంత్రీలతో పట్టణ వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పఖండ సభ్యులు పెచ్చేటి కృష్ణ, ఏడీవీప్రసాద్, జె.ఆదినారాయణ, పండూరి బ్రదర్స్ తదితరులు ఉన్నారు.

బీజేపీ జెండా తొలగింపుపై ఫిర్యాదు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 29: మండలంలోని తూర్పు లక్ష్మీపురం గ్రామంలో తమ పార్టీ జెండాను కొందరు తొలగించి కాలువలో పడేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆరోపించారు. జెండా స్థూపాన్ని వంచి పతాకాన్ని మురుగు కాలువలో పడేయడం ఎంతవరకూ భావ్యమని ప్రశ్నించారు. ఈ సంఘటనపై ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు ఇచ్చామని రామ్‌కుమార్ పేర్కొన్నారు.

గ్రామదేవతల భవనం ప్రారంభం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 29: సూర్యారావుపేటలో రూ.50 లక్షలతో నిర్మించిన గ్రామదేవతల సామూహిక భవనాన్ని గురువారం సర్పంచ్ సూరాడ చిన్నిరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో కురసాల సత్యనారాయణ, వైఎస్ రాజు, వెంకట్రాజు, గ్రామ కార్యదర్శి వెంకటరత్నం, మాజీ సర్పంచ్ కోమలి సత్యనారాయణ, గ్రామ పెద్దలు కోదండ, అమ్మోరియ్య ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తుని రూరల్, ఫిబ్రవరి 29: తుని రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఎస్.అన్నవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రపంచ శాంతి యువత పాత్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ సెక్రటరీ కె.కిషోర్‌రెడ్డి, డీవీ రాజు, సీహెచ్ మంగరాజు, ఎస్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

జగ్గంపేట, ఫిబ్రవరి 29: జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఐసీడీఎస్ సీడీపీవో ఎం.పూర్ణిమ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న మహిళలలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమ్మాజీ, సునీత, పార్వతి, బూసమ్మ, బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణపై అవగాహన

గండేపల్లి, ఫిబ్రవరి29: ఆదిత్య ఫార్మసీ కళాశాలలో దంతాల సంరక్షణ, పరిశుభ్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ జేసీఎల్ స్వరూప దంత సమస్యలపై అవగాహన కల్పించారు.